## జనరంజక పాలన సీఎం జగనన్నకే సాధ్యం



**పులివెందుల రూరల్, అక్టోబరు 28, ప్రభాతవార్త :**

రాష్ట్రంలో జనరంజక పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమవుతోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లతో సమానం అని ఆయన పేర్కొన్నారు. లింగాల మండలంలోని ఇప్పట్ల, ఫిరోజ్‌పురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. ఈ సందర్భంగా ప్రజలు అందించిన పలు వినతులను అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారం చూపించాలని ఓఎస్డీకి సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల వైఎస్ఆర్‌సీపీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, అంబకపల్లె బాబురెడ్డి, ఇతర వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శనివారం 29 అక్టోబర్ 2022


## రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**ఓబులవారిపల్లె, అక్టోబరు 28, ప్రభాతవార్త:**



జేసీతో మాట్లాడుతున్న వ్యవసాయ కమిటీ ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందేలా చొరవ చూపుతున్నదని వ్యవసాయ కమిటీ ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లాలో వ్యవసాయ మరియు రైతులకు సంబంధించి ప్రభుత్వం నుంచి వచ్చే ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందేలా చూసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. వ్యవసాయ సలహా కమిటీ మండలి సమావేశంలో కొన్ని ప్రాంతాలకు చెందిన వ్యవసాయానికి అనుగునంగా లేనందున ఆ ప్రాంతాల రైతులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలు పరిష్కరించాలని ఆయన సూచించారు. అన్ని విధాలా రైతులకు ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా జడ్పీ ఛైర్మన్ ఆకేపాటి తదితరులు పాల్గొన్నారు.

# తాళ్లపాక భూకుంభకోణంలో అక్రమ రిజిస్ట్రేషన్‌లు రద్దు

### నందలూరులో ప్రభుత్వ భూమి కబ్జాపై విచారణకు కలెక్టర్ ఆదేశం - ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్న ఆర్‌డిఒ

### కబ్జా జరిగిన భూమిని పరిశీలించిన ఆర్‌డిఒ కోదండరామిరెడ్డి : విఆర్‌ఒ సస్పెన్షన్

**రాజంపేట అర్బన్, అక్టోబరు 28 ప్రభాతవార్త**

తాళ్లపాక భూకుంభకోణంలో అక్రమ రిజిస్ట్రేషన్‌లు రద్దు అయ్యాయి. ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అమ్ముకొన్నవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన రెవెన్యూ అధికారులు తాజాగా రాజంపేట, రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగిన రిజిస్ట్రేషన్‌లు కూడ అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో రద్దు అయ్యాయి. నందలూరు భూకబ్జాపై కలెక్టర్ గిరీషా పి.ఎస్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు రాజంపేట ఆర్‌డిఒ కోదండరామిరెడ్డి శనివారం నందలూరులో ఎస్‌టి కాలనిలోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. 'వార్త' దినపత్రికలో 'నందలూరులో 10 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా' శీర్షికన గురవార్తం వార్త వెలువడడంతో అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆర్‌డిఒ కోదండరామిరెడ్డి శుక్రవారం కబ్జా జరిగిన భూమిని పరిశీలించారు. మండల కేంద్రంలోనే ఆక్రమణలు జరుగుతున్నా ఏమి చేస్తున్నారంటూ విఆర్‌ఒ వెంగయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిలో ఎవరు ప్రవేశించినా కఠినచర్యలు తీసుకొంటామని ఆర్‌డిఒ హెచ్చరించారు. అంతేగాకుండా ప్రభుత్వ భూమిని ఆక్రమించి చదును చేసినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు.




నందలూరు ఎస్‌టి కాలనిలో కబ్జా జరిగిన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కోదండరామిరెడ్డి

ఇదిలా ఉండగా 'వార్త' వెలుగులోకి తెచ్చిన తాళ్లపాక భూకుంభకోణంపై జిల్లా కలెక్టర్ గిరీషా సీరియస్‌గా స్పందించారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంపై కొరడా ఝుళిపించారు. అక్రమ రిజిస్ట్రేషన్‌లు రద్దు చేయాలని అన్నమయ్య జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. అంతేగాకుండా రాజంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయాలని రాజంపేట తహశిల్దారు సుబ్రమణ్యంరెడ్డిని ఆదేశించారు. దీంతో రాజంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తాళ్లపాకలోని సర్వేనంబరు 1076లో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేశారు. ఈ మేరకు తహశిల్దారు సుబ్రమణ్యంరెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాలను రాజంపేట సబ్‌రిజిస్ట్రార్ పార్వతికి అందజేశారు. కలెక్టర్ ఆదేశాలతో తాళ్లపాకలో ని ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లను రద్దు చేశారు. అంతేగాకుండా జిల్లా కలెక్టర్ ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు చూపిన తాళ్లపాక విఆర్‌ఒ పీరయ్య సర్టిఫికెట్‌ను సీరియస్‌గా పరిగణించారు. విఆర్‌ఒ పీరయ్య తన సంతకం ఫోర్జరి చేసి చేశారని రాజంపేట తహశిల్దారుకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా జిల్లా కలెక్టర్ పరిగణలోకి తీసుకోలేదు. విఆర్‌ఒ పీరయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పీరయ్యను సస్పెన్షన్ చేసిన విషయం వాస్తవమేనని అక్రమ రిజిస్ట్రేషన్‌లు రద్దు జరిగిన విషయం నిజమేనని తహశిల్దారు సుబ్రమణ్యంరెడ్డి వార్తకు ద్రవీకరించారు.

## రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అహర్నిషలు కృషి

### -జెడ్‌పి ఛైర్మన్ అమర్‌నాధరెడ్డి

**రాయచోటి.అక్టోబర్ 28 ప్రభాతవార్త**

రైతులు అభ్యున్నతికి ప్రభుత్వం అహర్నిషలు కృషి చేస్తుందని జెడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాధరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందనహాలు లో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ సుకుమార్ రెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అమర్‌నాధరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 80 శాతం మంది రైతులు వ్యవసాయం పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఆయన కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అధిక నిధులు వ్యయం చేస్తూ వ్యవసాయాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయాధికారులు గ్రామాలలో పర్యటించినప్పుడు రైతుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆయన సూచించారు. పరిష్కారం కాని సమస్యలను జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం దృష్టికి తెచ్చి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశానికి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులందరు తప్పక హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇ-క్రాఫ్ బుకింగ్ ప్రక్రియ 100 శాతం పూర్తి చేయడం గర్వించదగ్గ విశయమన్నారు. దీని ద్వారా



ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సీడి రైతులకు రావాల్సిన బెన్‌ఎట్స్ రావడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు ఏపంటలు సాగు చేశారు, ఎన్ని ఎకరాలు సాగు చేశారు అన్ని రకాల వివరాలను పగడ్బందీగా నమోదు చేయడం గొప్ప విషయమన్నారు. రబీ సీజన్‌కు సంబందించి రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను అందుబాటులో సిద్దంగా ఉంచాలన్నారు. సమావేశం లో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో పంట నమోదు కార్యక్రమం పక్కాగా నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో 2లక్షల 67 వేల 911 ఎకరాలకు గాను 100 శాతం పంట నమోదు చేయడం జరిగిందన్నారు. ఇ-కెవైసీకి సంబందించి ఒక లక్ష 18 వేల 619 మంది రైతులకు గాను 1,14,307 రైతులకు ఇ-కెవైసీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ సలహామండలి కమిటి సభ్యులు రవిరాజు, జిల్లా సిరికల్చరల్ అధికారి రాజశేఖర్ రెడ్డి, డ్వామా పిడి మద్దిలేటి, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## నాడు కట్టారు - నేడు పగలకొట్టారు

### -16 లక్షల ప్రజా ధనం వృధా

### -నోటీస్‌లు ఇచ్చి చేతులు దులుపుకున్న అధికారులు



**సంబేపల్లె.అక్టోబర్ 28 ప్రభాతవార్త**

దేశ అభివృద్ధికి గ్రామీణ ప్రాంతాలే పట్టు కొమ్మలు. మారు మూల ప్రాంతాలలో కనీస మౌళిక వసతుల్లో భాగంగా సిమెంట్ రోడ్లు డ్రైనేజ్ కాలువలు నిర్మించడం కోసం ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది. ఇంటిలోని మురుగు నీరు, వర్షపు నీరు డ్రైనేజీ కాలవల గుండా బయటకు చేరు విధంగా డ్రైనేజీ నిర్మాణాలను చేపడతున్నారుర. అధికారులు డ్రైనేజీ కాలవలు నాణ్యతగా చేపట్టి పది కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఎంతయినా ఉంది. ప్రజల అవసరాల కోసం లక్షలు ఖర్చు చేసి కట్టిన డ్రైనేజి కొట్టేశారు. అధికారులకు తెలిసినా నోటీస్‌లు ఇచ్చి చేతులు దులుపుకున్న సంఘటన సంబేపల్లె మండలంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే సంబేపల్లె మండలం సోమవరం గ్రామం దేవళం పేటలో సుమారు 80 కుటుంబాలు కలవు. ఆ గ్రామంలో డ్రైనేజి కాలవ నిర్మాణం కోసం ప్రభుత ం 2019-20 వ సంవత్సరంలో 16.60 లక్షల రూపాయలతో డ్రైనేజీ నిర్మాణం కొరకు మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను మంజూరు చేసింది. ఈ పనులను గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులు మాజీ సర్పంచ్ ద్వారా చేపట్టారు. ఈ పనులుకు సంబందించి బిల్లులను కొలతల ప్రకారం రికార్డ్ చేసి నిధులు డ్రా చేశారు. ఇదే పనులను నాడు నేనే చేశానని, నేనే కొట్టేశానని అన్నారు. డ్రైనేజి పనులకు సంబందించి 9లక్షల రూపాయలకు పైనే డబ్బులు డ్రా చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం పై స్థానికులు ఈ నెల 10వ తేదీన జిల్లా కలెక్టర్‌కు స్పందనలో పిర్యాదు చేశారు. సంబందిత అధి కారులు మాజీ సర్పంచ్‌కు తెలియజేసినా పట్టించుకోలేదు. అధికారులు మాత్రం నోటీస్‌లు జారీ చేసి చేతులు దులుపుకున్నారని విమర్శలు ఉన్నాయి. డ్రైనేజి నిర్మాణంలో లక్షల రూపాయలు ఖర్చు చేసి ఇలా వృధాగా పగలగొట్టడంతో ప్రజా ధనం వృధా చేశారని స్థానికులు ఆరోపించారు. డ్రైనేజి పనులు చేసి బిల్లులు వచ్చిన తర్వాత పగులగొట్టిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నాయకలు ఒత్తిడికి తలొగ్గి ఆ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకపోవడంపై పలు విమర్శలుకు తావిస్తోంది. అధికార పార్టీ నాయకులు ఏంచేసినా చర్యలు తీసుకోరా అని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

**వివరణ....**

ఈ విషయంపై గ్రామీణ నీటి పారుదల శాఖాధికారి హరినాధరెడ్డిని వివరణ కోరగా డ్రైనేజి పగులగొట్టిన మాట వాస్తవమేనని తెలిపారు. డ్రైనేజి నిర్మాణ పనులను యధావిధిగా చేపట్టమని నోటీస్‌లు జారీ చేసినట్లు తెలిపారు. నిర్మాణం చేపట్టకపోతే సదరు కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

# చియ్యపాడులో విషాదం

### విద్యుదాఘాతంతో ముగ్గురు మృతి

### అన్నదమ్ములు మృతితో శోకసముద్రంలో కుటుంబసభ్యులు



విద్యుత్‌ఘాతగానికి మృతి చెందిన దృశ్యం, సంఘటన వివరాలను తెలుసుకుంటున్న డిఎస్పీ, మృతికి కారణమైన విద్యుత్ వైర్లు

**చాపాడు, అక్టోబర్ 28 ప్రభాతవార్త :**

వైఎస్ఆర్ జిల్లా చాపాడు మండలం చియ్యపాడు గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తు వరి పొలంలో విద్యుత్ వైర్లు తగిలి ముగ్గురు మృతి చెందారు. వివరాలలోకి వెళ్తే అదే గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి ఓబుల్ రెడ్డి, పెద్దిరెడ్డి బాల ఓబుల్ రెడ్డిలు కౌలు రైతులు మీరు ఇరువురు అదే గ్రామం సమీపంలోని కొంతవరి పొలం కౌలుకు, చేసుకుంటూ ఉండేవారు శుక్రవారం అదే గ్రామానికి మల్లికార్జున రెడ్డి అనే యువకుడ్ని వరి పొలానికి తెగులు నివారణ కోసమూ మందులు పిచికారి చేసేందుకు ముగ్గురు కలిసి వెళ్ళారు. తమ వరి పంట పొలంలో విద్యుత్ స్తంబం దగ్గర విద్యుత్ తీగ తగిలి మొదట మల్లికార్జున రెడ్డి మృతిచెందగా అది గమనించిన ఓబుల్ రెడ్డి బాల ఓబుల్ రెడ్డిలు రక్షించేందుకు వెళ్లి చూడగా ముగ్గురు విగత జీవులై పడి ఉన్నారు. సంఘటన స్థలానికి మైదుకూరు డిఎస్పీ వంశీధర్ గౌడ్, చాపాడు ఎస్.ఐ. డాక్టర్ నాయక్‌లు చేరుకొని సంఘటన పూర్వపరాలు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం శవాలను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చాపాడు పోలీసులు తెలిపారు.

**శోకసముద్రంలో చియ్యపాడు గ్రామం**

అన్నదమ్ముల బంధం మరణంలోని వీడని అనుబంధం చియ్యపాడు గ్రామంలో విద్యుత్‌ఘాతంతో మృతి చెందిన పెద్దిరెడ్డి ఓబుల్ రెడ్డి, బాల ఓబుల్‌రెడ్డి స్వయాన అన్నదమ్ములు కావడంతో ఇరువురు ఏ పని చేసినా కలసి చేసేవారని విద్యుత్ ఘతంతో ఒకేసారి మృతి చెందడంతో అన్నదమ్ముల బంధం మరణంలో కూడా వీడని అనుబంధమని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. మల్లికార్జున రెడ్డి అవివాహితుడు కాగా పెద్దిరెడ్డి ఓబుల్ రెడ్డికి ఇరువురు కుమార్తెలు ఒకే గ్రామంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా గ్రామం శోక సముద్రంలో మునిగిపోయింది.

## ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### -నేర సమీక్ష సవవేశంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

**రాయచోటి.అక్టోబర్ 28 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. అన్నమయ్య జిల్లాలో రోడు ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత పోలీస్‌లు తీసుకోవాలని ఆయన కోరారు. శుక్రవా రం జిల్లా పోలీస్ కార్యాలయంలో మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వ హించి పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. చట్టవ్యతిరేఖ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని పోలీస్‌లను ఎస్పీ ఆదేశించారు. రోడు అదేవిధంగా ట్రాఫిక్ నియంత్రణకు అన్ని జాగ్రత్తలు చేపట్టాలని మైనర్‌లు వాహనాలు నడిపితే తల్లి దండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించాలని ఎస్పీ ఆదే శించారు. పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన తర్వాత దర్యాప్తు ముమ్మరం చేయకుండా కాలయాపన చేయడం జరుగుతుందని అవి పునరావృత్తం కాకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్క పోలీస్ అధికారి శ్రద్ధతో విధి నిర్వహణ పాటిస్తే పెండింగ్ కేసులను పరిష్కరించవచ్చని అన్నారు. చట్టవ్యతిరేఖ కార్యకలాపాలైన గుట్కా, మట్కా, పేకాట అక్రమ మద్యం రవాణా, ఎర్రచందన అక్రమ రవాణాపై ముందస్తు సమాచారం సేకరించి వీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి వంటి నిషేదిత మాదక ద్రవ్యాలను రవాణా మరియు విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కేసుల పరిష్కారానికై, ఛేదించడానికి ఎస్పీ పలు సూచనలు మెలుకవులు అధికారులకు సూచించారు. స్పందన కార్యక్రమంలో వచ్చే పిటీషన్‌లను నిర్ణీత సమయంలోపు పరిష్కరించాలన్నారు. మహిళా సంరక్షక కార్యదర్శుల వద్ద నుంచి ఆశించిన స్థాయిలో పని చేయించుకోవాలని సూచించారు. వీరంతా నిరంతరం ప్రజలలో తిరుగుతూ అజ్ఞాత శక్తులపై వారి కదలికలపై నిఘా ఉంచుతూ సంబందిత పోలీస్ స్టేషన్‌లలో ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. పట్టణాలలో గ్రామాలలో వివాదస్పద వ్యక్తులను గుర్తించి అవసరమయితే వారిని బైండోవర్ చేయించాలన్నారు. సమస్యాత్మక గ్రామాలను పట్టికలు తయారు చేసి ఆయా గ్రామాలలో కార్డన్ సర్చ్ నిర్వహించాలని సూచించారు. అంకిత భావంతో పని చేసిన సిబ్బందికి క్యాష్ రివార్డ్ అందజేసి ఎస్పీ వారిని ప్రోత్సహించారు. ప్రమాదాల కేసులు ఎర్రచందనం, నాటు సారా, అక్రమరవాణా, పేకాట, తదితర కేసులను నేరాల దర్యాప్తు స్పందన పిటీషన్‌ల గురించి మహిళా పోలీస్‌ల పనితీరు గురించి అలాగే గ్రామాలలోని వివాదస్పద వ్యక్తుల గురించి ఆయన సమీక్షలో ప్రస్తావించారు. నిరంతరం రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ తగిన ఏర్పాట్లు చేయాలని పోలీస్‌లను ఆదేశించారు. తెల్లవారుజామున బీట్ పోలీస్‌లు వాహన డ్రైవర్‌లను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ రవికుమార్, మదనపల్లె సబ్‌డివిజన్‌లోని సిఐలు,



## అమరవీరుల త్యాగాలు మరువలేనివి..



**కడప క్రైం, అక్టోబరు 28, ప్రభాతవార్త:**

కర్తవ్య నిర్వహణలో విధిని సైతం ఎదిరించి ప్రాణాలను పణంగా పెట్టిన అమరవీరుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం స్థానిక దిశ పోలీసు స్టేషన్ ఎదుట పోలీసు అమరవీరుల మహోన్నతమైన త్యాగాలు స్మరించుకుంటూ పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా బ్యాండ్ సిబ్బంది కళాజాత కార్యక్రమానికి ఏఆర్ డీఎస్పీ రమణయ్య, దిశ డీఎస్పీ వాసుదేవన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసు బ్యాండ్ సిబ్బంది సంగీత వాయిద్యాలతో అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సంగీత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ రకాల దేశభక్తి గీతాలను, గేయాలను, పాటలు ఆలపిస్తూ పోలీసు అమరవీరుల యొక్క త్యాగాలను వారి సేవలను గురించి ప్రజలకు తెలియజేస్తూ వారి యొక్క కీర్తిప్రతిష్టలను గీతాల రూపంలో ఆలపిచి ఆహుతులైన ప్రేక్షకులు మంత్రముగ్దులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతంగా సమాజ స్థాపనలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరఉల త్యాగాలు శ్లాఘనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీనివాసులు, మహబూబ్‌బాషా, సోమశేఖర్ నాయక్, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, నగరంలోని ఎస్సైలు పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## రాజంపేటలో పట్టపగలే 6 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా

### రెవెన్యూ అధికారులకు తెలియదా?
### సచివాలయ ఉద్యోగులు ఏమి చేస్తున్నారు?
### కోట్ల విలువైన ప్రభుత్వ భూములకు దిక్కెవరు?
### సచివాలయ వ్యవస్థ ఎందుకు?



ములక్కాయలపల్లెలో కబ్జా చేసిన కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలం, పట్టపగలే ప్రభుత్వ స్థలాన్ని చదును చేస్తున్న జెసిబి

**రాజంపేట అర్బన్, అక్టోబరు 28 ప్రభాతవార్త**

రెవెన్యూ డివిజన్ కేంద్రానికి ఆ గ్రామం కిలోమీటరు దూరంలో కూడా లేదు. మున్సిపాలిటి పరిధికి పక్కనే ఆ గ్రామం ఉంది. సెంటు 3 నుంచి 5 లక్షలు విలువ పలుకుతోంది. పట్టపగలు గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని భూ అక్రమార్కులు జెసిబి పెట్టి ఆక్రమించుకొంటున్నా పట్టించుకొనే దిక్కు లేదు. తహశిల్దారుకు సమాచారం లేదు. గ్రామాల్లోనే సచివాలయ వ్యవస్థ ఉన్నా ప్రభుత్వ ఆస్తులకు దిక్కులేదు. రాజంపేట పట్టణం పక్కనే ఉన్న ములక్కాయలపల్లెలో సుమారు 6 కోట్లు విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా జరుగుతోంది. గత 3 రోజులుగా ములక్కాయలపల్లెలో భూ అక్రమార్కులు జెసిబి పెట్టి స్థలాన్ని చదును చేస్తున్నారు. సచివాలయ సిబ్బందికి తెలిసినా చోద్యం చూస్తున్నారు. గ్రామ రెవెన్యూ సిబ్బంది వెళ్లి ఏమి చేయలేని దుస్థితి. ములక్కాయలపల్లెలో మన్నూరు రెవెన్యూ పొలంలో సర్వేనంబరు 1664లో 2.24 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని గ్రామస్థులు దిన్నె అని పిలుస్తారు. పశువులు కూడ అక్కడికే వెళుతుంటాయి. గ్రామ సరిహద్దులోనే ఉండడంతో ప్రజా అవసరాలకు ఉపయోగపడుతుందని ఇంతకాలం స్థానికులు భావించారు. అయితే ప్రభుత్వ భూమి అని చాలామందికి తెలియదు. దీంతో భూ అక్రమార్కుల కన్ను ఆ భూమిపై పడింది. గ్రామానికి చెందిన నలుగురు నేతలు ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు రంగం సిద్ధం చేశారు. రాజంపేట పట్టణంలో ములక్కాయలపల్లెకు వెళ్లేదారిలోనే కోట్ల రూపాయల విలువైన పట్టా భూమి వారికి ఉన్నా స్థానికంగా కొందరు నేతలతో కలిసి భూకబ్జాకు పాల్పడ్డారు. పట్టపగలే ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. దీంతో గ్రామంలో అలజడి రేగింది. రెవెన్యూ వారికి సమాచారం అందించినట్లు తెలిసింది. పెద్దకారంపల్లె సచివాలయ ఉద్యోగులు ఆ దారిన వెళుతున్న కనీసం కిలోమీటరు దూరంలోని రాజంపేట తహశిల్దారుకు సమాచారం అందించలేదు. గత రెండు మూడు రోజులుగా భూకబ్జా జరుగుతున్నా అడ్డుకొనే దిక్కు లేదు. ఇక అక్రమార్కులు పెట్రేగిపోయారు. సుమారు 2 ఎకరాలు పైబడి చదును చేశారు. ఈ అక్రమ భూబాగోతంపై ఆర్‌డిఒ కోదండరామిరెడ్డిని వివరణ స్థానిక వైకాపా నేతలు కొందరు కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అంతేగాకుండా జిల్లా కలెక్టర్ గిరీషాకు రాతపూర్వకంగా ఫిర్యాదు పంపినట్లు తెలిసింది. ఈ స్థలం మినహా ములక్కాయలపల్లెలో గ్రామ ప్రయోజనాలకు, ప్రజల అవసరాలకు ప్రభుత్వ భూమి ఎక్కడా లేదని, దీన్నే ఆక్రమిస్తే భవిష్యత్తు అవసరాలకు ఏమి చేయాలని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ భూకబ్జాపై రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకొంటారో వేచి చూడాల్సిందే.

## జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలి

### అసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ గిరీషా

### విద్య, వైద్యానికి సిఎం అధికప్రాధాన్యత : ఎమ్మెల్యే నవాజ్‌బాషా

**మదనపల్లెక్రైం, అక్టోబర్ 28 ప్రభాతవార్త:**

మదనపల్లె జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను జిల్లాకలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంకు కలెక్టర్ గిరీషా పిఎస్‌తో పాటు ఎమ్మెల్యే నవాజ్‌బాషాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ మదనపల్లె జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించలంటూ, రాత్రి సమయాల్లో వచ్చే కేసులను రెఫర్ చేయకుండా జిల్లా ఆసుపత్రిలోనే వైద్యసేవలు అందించాలని సూచించారు. ల్యాబ్‌కు సంబంధించిన పరికరాలు, టాయిలెట్స్ ఏర్పాటుకు శాంక్షన్ చేయడం జరిగిందన్నారు. అదనంగా సిసి కెమరాల ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే ఆరోగ్యశ్రీ సేవలను గణనీయంగా పెంచాలని సూచించారు. డెలివరీ సంఖ్యను పెంచాలని, డిఎంహెచ్‌ఓ పరిధిలోని 19ఖాళీల ఫోస్టులను వచ్చే సమావేశంలోగా భర్తీ చేయాలని డిఎంహెచ్‌ఓకు కలెక్టర్ ఆదేశించారు. గత సమావేశంలో అజెండాతో పాటు పలు అంశాలపై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించి నిర్ధేశించారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ విద్యకు వైద్యానికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందే వైద్య సేవలపై ప్రజలకు మరింత నమ్మకాన్ని పెంచాలన్నారు. వైద్యసేవలపై ఫిర్యాదులు రాకుండా చూడాలని వైద్యులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేది పేదవారే కనుక వారికి మంచి వైద్యం అందించాలన్నారు. ఈ సమీక్షలో మదనపల్లె ఆర్డీఓ ఎంఎస్.మురళి, డిఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, మదనపల్లె జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆంజనేయులు, అన్నమయ్య జిల్లా డిసిహెచ్‌ఓ డాక్టర్ పి.చంద్రశేఖర్, మున్సిపల్ కమీషనర్ ప్రమీల, చిత్తూరు డిఎంహెచ్‌ఓ కమిటీ సభ్యులు, వైద్యాధికారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు

## గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేకు కృషి

### - అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం
### - ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

**ములకల చెరువు, అక్టోబరు 28,**

ప్రభాతవార్త: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకొని ఆ సమస్యలను తీర్చేందుకే మీ ముందుకు వచ్చానని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ములకల చెరువు మండలంలోని బురకాయలకోట సెంట్రల్ స్కూలు గ్రామ పంచాయతీల్లో వివిధ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ముందుగా మండలంలోని సర్పంచులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలలో 90% అమలు చేశారన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు స్పందించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్యలు పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తే తగు చర్యలు తప్పవన్నారు. గత మూడున్నరేళ్లలో ఒక్క కుటుంబానికి అర్హతను బట్టి రూ.75వేల వరకు నేరుగా వారి ఖాతాలో జమ చేశారని వివరించారు. దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి ప్రజలకు గుర్తుండిపోయేలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీల, జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన రెడ్డి, ఎంపీడీవో రమేష్‌బాబు, తహసీల్దారు శ్రీనివాసులు, సర్పంచులు చిన్న మేకల వెంకట రమణారెడ్డి, విజయమ్మ, రవిశేఖర్‌రెడ్డి, రహ్మత్ బీ, జయచంద్ర, రాంబాబు, రెడ్డెప్ప, మాజీ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, నాయకులు ఆముదాల మధుసూదన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు చెకుముకి పోటి పరీక్షలు

వాల్మీకిపురం,అక్టోబర్ 28 :ప్రభాతవార్త



శుక్రవారం విద్యార్థులకు మండల స్థాయిలో చెకుముకి పోటీ పరీక్షలను నిర్వహించారు. మండల వ్యాప్తంగా 450 మంది విద్యార్థులు పరీక్షకు హాజర య్యారు. వాల్మీకిపురంలోని పివిసి హైస్కూల్, బాలికల జడ్‌పి,ఉర్దూ గురు కుల పాఠశాల,ఎస్‌సి బాలికల పాఠశాలలతో పాటు,అన్ని పాఠశాల విద్యార్థులు పాల్గొ న్నారు. పాఠశాల స్థాయి పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నవంబర్ 10న మండల స్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.

## పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయం

వాల్మీకిపురం,అక్టోబర్ 28:ప్రభాతవార్త



పార్టీలకతీతంగా అర్హత గల్గిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక పట్టణంలోని కొత్తపేటవీధి, నమాజ్‌కట్ట వీధి,కుమార్ నగర్ వీధులలో గడపగడప ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువు తున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ షబ్బీర్ అహ్మద్, ఏఈలు కమలాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, జాకీర్ హుస్సేన్,మాజీ జడ్‌పిటిసి సభ్యులు చింతల శివానంద రెడ్డి,సర్పంచ్ గంగులమ్మ,ఉప సర్పంచ్ కేశవ రెడ్డి, ఆర్‌బికే చైర్మెన్ నీళ్ల భాస్కర్,వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ రవినాయక్ నియోజికవర్గ మైనార్టీ నాయకులు అబ్దుల్ కలీమ్,నాయకులు నిర్దాల శ్రీధర్ రాయల్, రాజేష్,సాగుబడి ఆనంద రెడ్డి,చికెన్ మస్తాన్, సైపుల్లా, రమణారెడ్డి, శేషాద్రిరెడ్డి, గాండ్ల రమేష్,ఇర్ఫాన్ నాయకులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయాల ద్యోగులు పాల్గొన్నారు.

## ఉప ఖజానా శాఖ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ

వాల్మీకిపురం,అక్టోబర్ 28 : ప్రభాతవార్త



వాల్మీకిపురం ఉపఖజానా శాఖ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా ట్రెజరీ అకౌంట్ ఆఫీసర్ (డిడిఓ) మహబూబ్ బాష ఆకస్మికంగా తనిఖి చేశారు.ఇటీవల పలు పత్రికలలో ఇన్‌కం ట్యాక్స్ రీఫండ్ విషయంపై శుక్రవారం ఆకస్మికంగా వాల్మీకిపురం ట్రెజరీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రెజరీ డిపార్ట్‌లో ప్రతి నెల ఇన్‌కం ట్యాక్స్ 24 క్యూ ను అపలోడ్ చేసి బిన్ నెంబర్ మాత్రం ఇస్తామని వెల్లడించారు.ఇన్‌కం ట్యాక్స్ రీఫండ్ అనేది ప్రైవేటు ఆడిటర్లు చేయవలసిన పని, రీఫండ్‌కు ట్రెజరీ అది కారులకు సంభందం లేదని పేర్కొన్నారు. ఇన్‌కం ట్యాక్స్ బోగస్ రీఫండ్ చేసు కొన్నారన్నది అవాస్తవం అని తెలిపారు. స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

పీలేరు, అక్టోబరు 28 ప్రభాతవార్త:



రాష్ట్రంలో ఇప్పటికే అధికార, ప్రతి పక్షాలపై ప్రజలు విగిసి చెంది కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని అందుకోసం ప్రతి ఒక్కరు కాంగ్రెస్ నాయకులు, కార్య కర్తలు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమరతేజ తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులు క్రితం కాంగ్రెస్ నాయకులు రాహుల గాంధీ భారత్‌జోడో యాత్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టి రాష్ట్రం దాటేంత వరకు ఆయన వెంటే ఉండి పాదయాత్ర చేశామని కాంగ్రెస్ పార్టీ ఎలా బలోపేతం చేయాలో రాహుల్‌గాంధీ తెలియ జేశారన్నారు.

## పేదలకు వరం ఆరగ్యో శ్రీ

పీలేరు, అక్టోబరు 28 ప్రభాతవార్త:



ఆరోగ్యానికి మించిన సంపద లేదని ఒక మహాకవి అన్న మాటలు సీఎం జగన్ నిజం చేయటానికి ఆరోగ్య శ్రీ పథకం ప్రవేశపెట్టారని అటువంటి కార్య క్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అదే ఆరోగ్యశ్రీ కర్తవ్యమని జిల్లా డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. రాష్ట్రంలో గతంలో ప్రవేశ పెట్టిన దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం కూడు గుడ్డ లేని నిరుపేదలకు కూడా సంపూర్ణ ఆరోగ్యం అందించిందని ఆయన అన్నారను. వ్యాధులు అన్నింటికి ఉచిత వైద్యం ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రత్యేక బందంతో అధ్యయనం చేసి కమిటీ సిఫారస్సుల మేరకు ఇంతకు ముందు ఉన్న 2446 వ్యాధులకే కాకుండా ఇపుటు 3351 వ్యాధులకు గాను కావలసిన ఉచిత వైద్యంతో పాటు వారికి కావలసిన మందులు కూడా ఉచితంగా అందజేసిన ఘనత సీఎంకే దక్కిందని లోకవర్గన్ అన్నారు. అన్నమయ్య జిల్లాలో కూడా ప్రతినెల 2వేలకు మించి వివిధ రకాల రోగులకు వైద్యం అందిస్తున్నామని డాక్టర్ తెలిపారు.

## శివాలయ యాత్రకు ప్రత్యేక బస్సు

పీలేరు, అక్టోబరు 28 ప్రభాతవార్త:

కారీ ్తకమాసంలో ప్రజలు అధిక సంఖ్యలో శివాలయాలను సందర్శిస్తుంటారు. అందుకు పీలేరు ఆర్టీసీ డిపో మేనేజరు బండ్లకుమార్ ప్రయాణికుల సౌకర్యార్థం శివాలయాలకు ప్రత్యేక బస్సు ఏర్పాటుచేశారు. దీనిని భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 31 నుంచి ప్రతి సోమవారం భక్తులు గుడిమల్లం, ముక్కంటి, శ్రీకాళహస్తి, కపిలతీర్థం, తలకోనతో సహా5 శివా లయాల దర్శనం చేయించబడునన్నారు. రానుపోను బస్సు చార్జీ పెద్దలకు 325, పిల్లలకు 177రూపాయలు మాత్రమే అన్నారు. కార్తీక మాసంలో శివ భక్తు లు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పేదల సంక్షేమం కోసం పెద్దపీట : ఎమ్మెల్యే

మదనపల్లె, అక్టోబర్ 28 ప్రభాతవార్త :



పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే నవాజ్ బాషా తెలిపారు. శుక్రవారం 18వ వార్డు లోని సైదాపేట సచివాలయ పరిధిలో అవంతి థియేటర్ నుండి గడప గడప కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ నూర్ అజాం ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌తో ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి లబ్దిదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి నిరుపేదల సంక్షేమం కోసం నవరత్నాల పేరుతో ప్రభుత్వ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 95శాతం నెరవేర్చడం జరిగిందన్నారు. అర్హులుగా ఉండి పథ కాలు అందనివారు ధరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మెన్ జింకా వెంకటాచలపతి, డిఈ శీరీష, కౌన్సిలర్లు రామశెట్టి శివయ్య, ఎస్‌వి. రమణ, ఖాజా, ఎంవి.రమణ, ఆర్‌వి. శివారెడ్డి అధికారులు పాల్గొన్నారు.

## నిమ్మనపల్లెలో మాజీ డిసిసిబి డైరెక్టర్ వర్ధంతి

మదనపల్లె, అక్టోబర్ 28 ప్రభాతవార్త :



నిమ్మనపల్లె మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాజీ డిసిసిబి డైరెక్టర్ మూరే మునిరెడ్డి 17వ వర్ధంతిఘనంగా నిర్వహించారు. ఈ వర్ధంతిని శుక్రవారం మాజీ మార్కెట్‌కమిటీ వైస్‌ఛైర్మెన్ మూరే విజయకుమార్‌రెడ్డి, సతీమణి అరుణల ఆధ్వర్యంలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేవారు. ఈసందర్భంగా విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనతండ్రి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది, లక్ష్మినారాయన సోమువేఖర్‌రెడ్డి, వెంకటరమణ, బాబు, సరోజమ్మ పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయండి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 28, ప్రభాతవార్త:



విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డా.అంబవరం ప్రభాకర్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్ర వారం పోరుమామిళ్ల మండలంలో జరుగు తున్న టీచింగ్ అట్ ది రైట్ లెవెల్ 4 రోజుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం పీవో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ గణితం వంటి వాటిపై విద్యార్థులు చిన్నతనం నుంచి మక్కువ పెంచుకొని అత్యున్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. సమాజం హితం కోరే విధంగా విద్యా భ్యాసం జరగాలని, అందుకు ఉపాధ్యాయులే ప్రాధాన్యమని పీవో సూచించారు. అనంతరం డా.మార్కారెడ్డి రూపొందిం చిన విద్యార్థుల కోసం మన కార్యక్రమం - ఆదర్శమైన విద్యార్థిగా రూపొందించడానికి 21 సూత్రాల ప్రణాళికా పోస్టర్లను పీవో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ రాజశేఖర్ రిటైర్డ్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ మార్కారెడ్డి, మాజీ ఉప విద్యా శాఖాధికారి నాగమునిరెడ్డి, మండల విద్యాశాఖాధికారి రఘు, రీసోర్స్ పర్సన్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మదనపల్లె-కదిరికి హైర్‌బస్సు ప్రారంభం

మదనపల్లె, అక్టోబర్ 28 ప్రభాతవార్త :



మదనపల్లె వన్‌డిపోలో మదనపల్లె-కదిరి రూటుకు సంబంధించిన ఓ హైర్‌బస్సును డిపో మేనేజర్ వెంకట రమణా రెడ్డి ప్రారంభించారు. ఈ బస్సు ప్రారంభం కార్యక్రమంలో ట్రాఫిక్ గ్యారేజి సిబ్బంది, అసోసియేట్ లీడర్లు, బస్సు ఓనర్ పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేటర్లు 7లోగా ఓటు నమోదు చేసుకోవాలి

మదనపల్లె, అక్టోబర్ 28 ప్రభాతవార్త :



గ్రాడ్యుయేటర్లు నవంబర్ 7లోగా నమోదు చేసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు హరిశర్మ, మధురవాణి తెలిపారు. శుక్రవారం అంగన్‌వాడీ ఉపా ధ్యాయుల సమావేశంలో వారు మాట్లా డుతూ గ్రాడ్యుయేట్లు ఓట్లు కోసం తమ ఆధార్‌కార్డు, ఫోటో, డిగ్రీ సర్టిఫికెట్లను జతచేసిన ఫారం-18ను అందజేసి ఓటు పొందాలన్నారు. మున్సిపల్, తహశీ ల్దార్, ఎంపిడిఓ, ఆర్డీఓ కార్యాలయాల్లో ఓటు నమోదు ప్రక్రియ జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో సుభద్ర, సుజాత, మధుమతి, భాగ్యమ్మ, ప్రమీల, నాగరత్న పాల్గొన్నారు.

## పొలతల మల్లేశ్వర స్వామిని దర్శించుకున్న తహసీల్దారు

పెండ్లిమర్రి, అక్టోబరు 28, ప్రభాతవార్త:



పొలతల మల్లేశ్వర స్వామిని శుక్రవారం పెండ్లిమర్రి తహసీల్దారు ఉదయ భాస్కర్‌రాజు దర్శించుకున్నారు. అక్క దేవతలను, బండెన్నను, కాశినాయన పుట్ట ఆంజనేయస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. మొక్కుబడుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## విలేజ్ హెల్త్ క్లినిక్‌లు సద్వినియోగం చేసుకోవాలి

పెండ్లిమర్రి, అక్టోబరు 28, ప్రభాతవార్త:



గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం పెండ్లిమర్రి మండలం వెల్లటూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆయన సందర్శించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో 24 గంటలూ 14 రకాల డయాగ్నోస్టిక్ ర్యాపిడ్ కిట్లు 67 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటరెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ లక్షుమయ్య, డా.జేవీఆర్ ప్రసాద్, 104 డా.ఎ.శివానంద్, సీహెచ్‌వో సుమలీలా, ఏఎన్ఎం రోజా, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి, పీఎస్ శ్రీకళ, హెచ్‌ఎడి.వల్లీబాషా, ఏఎన్ఎం బషీరున్నీషా, బిల్కిస్ బేగం పాల్గొన్నారు.

## జిల్లా ఎంపికల్లో క్రీడాకారులు తఢాకా చూపాలి

తంబళ్లపల్లె, అక్టోబరు 28, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో తమ ప్రతిభ కనబరిచి తఢాకా చూపించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ప్రోత్సహించారు. శుక్రవారం జడ్పీ హైస్కూల్లో తంబళ్లపల్లె నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపిక ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడల్లో రాణించి పాఠశాలలకు తద్వారా తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. క్రీడాకారుల ప్రోత్సాహానికి ముఖ్యమంత్రది జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి స్థాయిలో సహకరించడం హర్షనీయమన్నారు. తంబళ్లపల్లె క్రీడా పోటీలకు ఎంపికైన 116 మంది క్రీడాకారులు జిల్లా స్థాయి ఎంపికల్లో రాణించి తలెత్తు కొనేలా ప్రతిభ కనబరచాలన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి, సర్పంచులు నీలూ మైనుద్దీన్, శ్రీనివాసులు, కోఆప్షన్ వమెంబర్ జమాల్ బాషా, ఎంఈవో త్యాగరాజు, ఎంపీడీవో ఆనంద్‌కుమార్, మండల వైకాపా అధ్యక్షుడు రేపన చౌడేశ్వర, హెడ్మాస్టర్ ఆంజనేయులు, స్కూలు కమిటీ ఛైర్మన్ సురేష్, ఆర్‌బీకే ఛైర్మన్ రెడ్డి మల్‌రెడ్డి, పీఈటీ వసంత, ఎంపీటీసీలు కరీం, సరోజమ్మ, గుండ్లపల్లి సర్పంచ్ మౌలాలి, సీఆర్పీ సుధాకర్, ఆరు మండలాల హెడ్మాస్టర్లు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి

కలికిరి, అక్టోబర్ 28 ప్రభాతవార్త :



ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి ఏర్పాటు చేయడం, మంచినీరు సౌకర్యం, పారిశుద్ధ్యం మెరుగుపరచడమే జలజీవన స్రవంతి పథకం ముఖ్య ఉద్దేశమని పోర్డు స్వచ్చందసంస్థ టీమ్ లీడర్ స్వర్ణకుమారి అన్నారు. మర్రికుంటపల్లె పంచాయితీ కార్యాలయంలో శుక్రవారం జేజేఎం కమిటీ ఏర్పాటు, అదే విధంగా పారిశుద్ధ్య కమిటీలను ఏర్పాటు చేసి కమిటీ సభ్యులకు పోర్డు సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్తానికసర్పంచ్ రెడ్డిరామ్, కార్యదర్శి తిమ్మారెడ్డి, పోర్డు స్వచ్చందసంస్థ సభ్యులు వెంకటేష్, మాధవి, ప్రభాకర్, సభ్యులు పాల్గొన్నారు.

## ఎంఎల్ఏను సుధీర్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి

ఎర్రగుంట్ల అక్టోబర్ 28, ప్రభాతవార్త



కడప కర్నూలు అనంతపురం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి మరియు కడప మేయర్ సురేష్ బాబు జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం సుధీర్ రెడ్డిని శుక్ర వారం సాయంత్రం మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఈ సంద ర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పార్టీ తరపున కడప కర్నూలు అనంత పురం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రా రెడ్డికి పట్టభద్రుల ఓటర్లందరూ మద్దతు తెలిపి, అతనిని గెలిపించాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఓటర్లను కోరారు.

## ఖాజీలు నిర్దిష్టమైన నియమాలు పాటించాలి

### - డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

కడప ఏడురోడ్లు, అక్టోబరు 28, ప్రభాతవార్త:



విజయవాడ నగరంలో ఏపీ ఆర్టీ ఖాజీల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి మైనార్టీ సంక్షేమ శాఖామాత్యులు ఎస్.బి. అంజాద్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖాజీల జీవోఆర్టీ ప్రకారం కాకుండా పర్మినెంట్ నియామకం చేపట్టాలని ఖాజీలు ఆయనను అభ్యర్థించారు. ఈ విషయం గురించి డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఖాజీలంటే ముస్లిం సమాజానికి న్యాయ నిర్దేశం చేసే వారని, వారంటే అమిత గౌరవమని, వారిని కష్టపెట్టాలని కానీ, బాధ పెట్టాలనే ఆలోచన ప్రభుత్వానికి ఏ కోశానా లేదన్నారు. కానీ కొందరి నిర్వాకం వలన యావత్తు ఖాజీలకు చెడ్డ పేరు రావడం దురదృష్టకరమైన విషయమన్నారు. ముస్లిం సమాజంలో నిఖా, తలాక్, ఖులా విషయాలలో సమాజంలో నిఖా, తలాక్, ఖులా విషయాలలో తలెత్తు తున్న వివిధ సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి అబ్దుల్ ఖదీర్, ఖాజీలు పాల్గొన్నారు.

## జెరూసలేం యాత్రకు ప్రభుత్వం చర్యలు

### - డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

కడప కార్పొరేషన్, అక్టోబరు 28, ప్రభాతవార్త:



ఏపీ ప్రభుత్వం క్రైస్తవ సోదరులు, సోదరీమణులను 2022 పవిత్ర జెరూసలేం యాత్రకు పంపేందుకు చర్యలు చేపట్టిందని ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమశాఖామంత్రి అంజాద్‌బాషా అన్నారు. రాష్ట్ర సచివాలయంలో ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేష్, ఉర్దూ అకాడమీ, హజ్ కమిటీ ఛైర్‌పర్సన్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమా వేశం జరిగింది. అంజాద్‌బాషా మాట్లాడుతూ ఉర్దూ భాషాభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. 2023 హజ్ యాత్రకు సంబంధించి ఎంబెర్కేషన్ ఏపీసీ ఈడీ ఎం తరుపున మైనార్టీవర్గాల విద్యా, ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. 2022 చివరి నాటికి కనీసం 109 మంది క్రైస్తవ సోదర సోదరీ మణులను పవిత్ర జెరూసలేం యాత్రకు పంపేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ఎస్ఆర్ఐటీ విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు క్రైం, అక్టోబరు 28, ప్రభాతవార్త:



జేఎన్‌టీయూఏ నిర్వహించిన బీటెక్ 3వ సంవత్సరం 2వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో సివిల్ నందు ఎం.లావణ్య 80.12, ఐ.నందిని 78.47, డి.అశ్విని 77.64, ఈఈఈ నందు ఎ.శిరీష 86. 94, కె.నాగలక్ష్మి 82.82, ఎస్.మహబూబ్ చాంద్ 81.06, మెకానికల్ విభాగంలో శ్యాసుందర ఆచారి 82, శివచైతన్య 79.18, రవిశంకర్ 77.65, ఈసీఈ నందు గురుప్రత్యూష 82.94, హైమావతి మరియు మౌనిక 81.53, సునీత 79.41, సీఎస్ఈలో విజయలక్ష్మి 85.76, జె.లక్ష్మీ మనీషా 84.59, హిమబిందు 82 మార్కులు సాధించి కళాశాల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్నారని ప్రిన్సిపల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఓడీలు అభినందించారు.

## మధ్యాహ్న భోజనాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 28, ప్రభాతవార్త:

ప్రతి ఒక్క పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులు భోజనం చేసిన తరువాత ఐఎంఎంఎస్ యాప్ ద్వారా కచ్చితంగా నమోదు చేయాలని కడప డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కడప మండల పరిధిలోని సీఎస్ఐ ఉన్నత పాఠశాలలో కడప మండల విద్యాశాఖాధికారి పాలెం నారాయణతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాల ప్రతి రోజు ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని రోజు పాఠశాల విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. గుడ్లు, చిక్కిలను కేటాయించిన రోజుల్లో తప్పనిసరిగా విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. విద్యార్థుల ద్వారా మధ్యాహ్నం నాణ్యత, పరిమాణం అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉచిత న్యాయ సహాయంపై న్యాయ విజ్ఞాన సదస్సు

కడప లీగల్, అక్టోబరు 28, ప్రభాతవార్త:

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.కవిత శుక్రవారం ట్రాన్స్‌జెండర్స్‌కు ఉచిత న్యాయ సహాయంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లాలోని ప్రతి కోర్టులో మండల న్యాయ సేవా సమితిలుంటాయన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న వారు ఆయా కోర్టులలో ఉన్న మండ న్యాయ సేవా సమితిలను సంప్రదించి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చన్నారు. సెక్షన్ 12 లీగల్ సర్వీస్ అథారిటీ యాక్ట్ 1987 గురించి వివరించారు. ఫ్రీ లిటిగేషన్ కేసులపై అవగాహన కల్పించారు. జాతీయ లోక్ అదాలత్‌లపైన అవగాహన కల్పించారు. రాజీమార్గమే రాజమార్గమని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మండల న్యాయ సేవా సమితి విధి విధానాలు తెలిపారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకొని రావచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్, డిజబులిటీ ఏబుల్డ్, ట్రాన్స్‌జెండర్స్ సీనియర్ సిటిజన్స్ అధికారి ఆర్.వి.కృష్ణ, కిశోర్ ట్రాన్స్‌జెండర్స్ పాల్గొన్నారు.

## టీఏఆర్ఎల్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన డీఈవో

పెండ్లిమర్రి, అక్టోబరు 28, ప్రభాతవార్త:



మండల స్థాయి టీఏఆర్ఎల్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం డీఈవో సి.దేవరాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సామర్థ్యాలు ఈ శిక్షణ ద్వారా ఉపయోగపడుతుందని తెలిపారు. పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను, సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ శిక్షణ ఉప యోగపడుతుందన్నారు. అంబేద్కర్, అబ్దుల్ కలాం లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఏఎంఓ సమగ్ర శిక్ష రామాంజులరెడ్డి, హెచ్ఎం శంకరాచారి, రీసోర్స్ పర్సన్లు మంజుల వాణి, సూర్యకుమార్, బాబురెడ్డి, బయపురెడ్డి ఎంఈవో సుజాత పాల్గొన్నారు.

## ప్రతి పంటలో విత్తనశుద్ధి అవసరం

### - మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి

జమ్మలమడుగు, అక్టోబరు 28, ప్రభాతవార్త:



ముద్దనూరు మండలం ఉప్పులూరు రైతు భరోసా కేంద్రం పరిధిలో శుక్రవారం కర్నాటి విశ్వనాథరెడ్డి తన పొలంలో మినుము పంటను 17 ఎకరాల్లో సాగు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. మినుము విత్తనాలకు ప్రయోగాత్మకంగా కార్బండిజం మ్యాంకోజల్ అనే మందులతో విత్తన శుద్ధి చేసే విధానాన్ని రైతులకు తెలియజేయడం జరిగిందన్నారు. ప్రతి రైతు రబీలో సాగు చేసే ప్రతి పంటను తప్పనిసరిగా ఏదైనా ఒక తెగులు మందుతో విత్తనశుద్ధి చేసుకోవడం వలన 50% చీడపీడలు రాకుండా అరికట్టవచ్చాన్నారు. ప్రతి సంవత్సరం సాగు చేసే అన్ని పంటలకు ముందు జాగ్రత్తగా విత్తనశుద్ధి చేసుకుంటామని వ్యవసాయాధికారి రైతులు తెలిపారు. కార్యక్రమలో గ్రామ ఉద్యాన సహాయకులు నంద్యాల రామసుందర్‌రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు మహిళల ఆత్మగౌరవ పరీక్ష

### దీక్షకు ఎమ్మెలే సంఘీభావం

ప్రొద్దుటూరు అక్టోబర్ 28, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు టడిపికి చెందిన లక్ష్మీ నారాయణమ్మ, ఆమె కుమార్తె ఆర్పీ లలిత డ్వాక్రా సంఘాల మహిళల డబ్బు రూ.31.83 లక్షలను స్వాహా చేశారని వారి నుండి డబ్బులు వసూలు చేసి మహిళలకు న్యాయం చేసేంత వరకు పోరాటం సాగిస్తామని, మోసం చేసిన వారిని పరామర్శించిన నారా లోకేష్ బేషరతు గా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బాధిత మహిళలతో కలిసి శుక్రవారం 24 గంటలు పాటు స్థానిక శివాలయం కూడలిలో మహిళల ఆత్మగౌరవ దీక్ష చేపట్టినట్లు మున్సిపల్ ఛైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పేర్కొన్నారు. ఎమ్మెల్యే ,రాచమల్లు శివప్రసాద్ రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి తన సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో ఆసరా, డ్వాక్రా, రుణమాఫీకి సంబంధించి రికార్డులను పరిశీలించగా గోల్మాల్ చేసిన మాట వాస్తవమని తేలిందన్నారు. దీనికి వారు తగిన సమాధానం స్పష్టం చేయకపోవడం శోచనీయమన్నారు. 29 వేల మంది పొదుపు సంఘాల మహిళలకు, 2900 ఎల్ఎస్ఎల్ఎఫ్ గ్రూపులకు, 92మంది ఆర్పీలకు మద్దతుగా వేలాదిమంది పొదుపు సంఘాల మహిళలు ర్యాలీగా వెళ్లి గురువారం తహసీల్దార్‌కు విన్నవించామన్నారు. ఈ దీక్షకు మద్దతుగా హిళా కౌన్సిలర్లు, వైసిపి నాయకులు కల్లూరు నాగేంద్రారెడ్డి, ఎంపీపీ శేఖర్‌యాదవ్, రాయపురెడ్డి, కాకర్ల నాగ శేషారెడ్డి, శంకర్ యాదవ్, సూరి, చల్లా రాజగోపాల్ యాదవ్, ప్రతాప్‌రెడ్డి, బాలక్రిష్ణ, మల్లికార్జున యాదవ్, వేణుగోపాల్ నిలిచారు.

## ఉచిత ఎముకల సాంద్రత పరీక్ష

ప్రొద్దుటూరు అక్టోబర్ 28, ప్రభాతవార్త

ప్రపంచ ఆర్థొరైటిస్ దినోత్సవం సందర్భంగా శ్రీ సంజీవిని ఫిజియో థెరపీ ఆర్థో, న్యూరో రిహాబిలిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్ష మెగా వైద్య పరీక్షా శిబిరాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ జి సర్వేష్ తెలిపారు. స్థానిక హోమాస్ పేటలోని శ్రీ సంజీవని ఫిజియో థెరపీ ఆసుపత్రిలో దయం 8 గంటలనుండి మధ్యహ్నం 3 గంటల వరకు నిర్వహించే ఈ మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనికి సంబందించిన రోగులకు ఎక్సరే లో 50శాతం తగ్గింపు ధరలతో అందిస్తున్నామన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ అ కాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## 17వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రొద్దుటూరు అక్టోబర్ 28, ప్రభాతవార్త



ప్రజా సమస్యల పరిష్కారమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ లక్ష్యం అని ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు స్థానిక 17వ వార్డు కౌన్సిలర్ చింతకుంట సుచరిత, వార్డు వైసీపీ నాయకులు చింతకుంట జయ లింగారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమములో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వార్డులో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యల పై ఆరాతీశారు. జగనన్న ప్రవేశపెట్టిన పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలతో మాట్లాడుతూ వార్డులో చిన్నపాటి సమస్యలను పరిశీలించి. ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు కాకర్ల నాగ శేషారెడ్డి, టౌన్ బ్యాంకు అధ్యక్షులు వెల్లాల కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు అక్రమ్ మహమ్మద్ గౌస్, వైసీపీ కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి, షేక్ కమల్ భాష, సత్యం, భావన సహకార సంఘం చైర్మన్ రమణయ్య, తొగటవీర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చౌడం రవి, బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ రసపుత్ర రజని, హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు ద్వార్శల భాస్కర్ రెడ్డి, రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళి, వైసీపీ నాయకులు ఆచారి కాలనీ శివారెడ్డి, రాయపురెడ్డి , కోఆప్షన్ మెంబర్ మల్లికార్జున ప్రసాద్, గోటూరు వెంకటేష్, సచివాలయ సిబ్బంది వార్డ్ వాలంటీర్లు, వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రభుత్వ బాలుర వసతి గృహం తనిఖీ చేసిన జడ్జి కవిత

కడప లీగల్, అక్టోబరు 28, ప్రభాతవార్త:



కడప నగరంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం జిల్లా న్యాయఃసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జీ కవిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ పిల్లలకు అందుతున్న వసతి సదు పాయాలు అడిగి తెలుసుకున్నారు. రిజిష్టర్లను పరిశీలించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంర క్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 గురించి వివరించారు. పిల్లల పట్ల ఎప్పటికప్పుడు తగు జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతిగృహ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## మొబైల్ ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పెండ్లిమర్రి, అక్టోబరు 28, ప్రభాతవార్త:

మొబైల్ ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అల్తాఫ్ హుసేన్ తెలిపారు. ఈనెల 28 నుంచి 31 వరకు గంగనపల్లె జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని, 29 వరకు చీమల పెంట అప్పర్ ప్రైమరీ స్కూలులో ఉంటుందన్నారు. మొబైల్ ఆధార్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయండి : టిడిపి

కడప, అక్టోబరు 28, ప్రభాతవార్త:



కమలాపురం నగర పంచాయతీ పరిధిలో ఉన్న పలు సమస్యలపై నగర పంచాయతీ కమిషనర్ రాజశేఖర్‌కు శుక్రవారం టీడీపీ మండల నాయకులు మెమోరాండం సమర్పించారు. కమలాపురం నగర పంచాయతీలో ఉన్న అనేక సమస్యలను పట్టించుకోవడం లేదంటూ అధికారులు, కాంట్రాక్టర్లు కాలయాపన చేస్తున్నారంటూ అర్జీలో పేర్కొన్నారు. 12 సమస్యలను కమిషనర్ రాజశేఖర్ దృష్టికి తీసుకురావడం జరిగిందని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాఘవ రెడ్డి, దివాకర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, తిప్పాయపల్లె సుబ్బారెడ్డి, జంపాల నరసింహా రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బాబుల్, రఫీ, చంద్ర, రాము, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నూతన మసీదుకు శంకుస్థాన

జమ్మలమడుగు, అక్టోబరు 28, ప్రభాతవార్త:



జమ్మలమడుగు పట్టణంలో నూతన మసీదు నిర్మాణానికి శుక్రవారం జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్ పాషాఖాద్రి భక్తులతో కలిసి శంకుస్థాపన చేశారు. మదరసా యే ఫజులుర్రహ మానియా దారుల్ వులూమ్ వద్ద భక్తులతో కలిసి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం టెంకాయ కొట్టి నూతన మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ 40 సంవత్సరాల వరకు గూడు మస్తాన్ వలీ దర్గా వద్ద ఒక సత్రం మాత్రమే ఉండేదని, ఆ సత్రం ఎలాంటి తలుపులు, సౌకర్యాలు ఉండేవి కాదని తెలిపారు. గూడుమస్తాన్ వలీ స్వామి దర్గా వద్ద ఒక నూతన మసీదు నిర్మించాలని దర్గా కమిటీ నిర్వాహకులు మరియు దర్గా ఆవరణంలో నివసించే ప్రజలు, మహిళలు అందరి సహకారంతో తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ మసీదు నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని పీఠాధిపతి కోరారు. కార్యక్రమంలో మదరసా నిర్వాహకులు ఖాజావలీ, ముస్లిం సోదర సోదరీమణులు, భక్తులు, చిన్నారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డ్రైవర్లకు అవగాహన సదస్సు

**ప్రొద్దుటూరు క్రైం, అక్టోబరు 28, ప్రభాతవార్త:**



ప్రొద్దుటూరు ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ప్యాసింజరు, లగేజీ ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఆర్డీవో సుశీల మాట్లాడుతూ వారికి రహదారి భద్రతా,రోడ్డు మీద పాటించాల్సిన నియమ నిబంధనలు తెలిపారు. ఆటోల్లో టాప్ మీద ప్రయానికులను ఎక్కించుట, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, రికార్డులు అప్‌డేట్ చేయడం, ప్యాసింజర్ ఆటోలకు బిగించిన లగేజీ స్టాండ్లు తీసివేయడం గురించి అలాగే ప్రతి ఒక్కరూ విధిగా లైసెన్సులు కలిగి ఉండాలని లేదంటే ఆన్‌లైన్‌లో డీఎల్‌కు అప్లై చేసుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.కార్యక్రమంలో ఎంవీఐలు వేణు, నారాయణ నాయక్, శ్రీనివాస్, ఏడీ కరీముల్లా, సీఐటీయూ చైతన్య, ఆటో యూనియన్ నాయకులు,40 మంది ప్యాసింజరు, లగేజీ ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందించాలి

**పులివెందుల రూరల్, అక్టోబరు 28, ప్రభాతవార్త :**



పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు తడి, పొడి చెత్తలను వేర్వేరు చేసి ఇళ్ల వద్దకు వచ్చే వాహనాలకు అందించాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, కమీషనరు నరసింహారెడ్డిలతో కలిసి శుక్రవారం ఆయన నగరిగుట్టలో పర్యటించారు. ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆకుపచ్చ రంగు బుట్టలో తడిచెత్తను, నీలి రంగు బుట్టలో పొడిచెత్తను, ఎరుపురంగు బుట్టలో హానికర వ్యర్థాలను వేసి పురపాలక చెత్తసేకరణ వాహనానికి అందించాలన్నారు. ప్రతి గృహిణి తమవంతు బాధ్యతగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమానికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ గుర్రప్పయాదవ్, శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళీధర్, టౌన్‌ప్లాసింగ్ అధికారి అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీల నిజమైన నేస్తం కాంగ్రెస్ పార్టీనే

**– ఏపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ తులసిరెడ్డి**

**వేంపల్లె, అక్టోబరు 28, ప్రభాతవార్త :**



బీసీల ఓట్ల కోసం వైఎస్ఆర్‌సీపీ, టీడీపీలు కపట నాటకాలు ఆడుతున్నాయని, మొసలికన్నీరు కారుస్తున్నాయని ఏపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక్కటే బీసీలకు నిజమైన నేస్తం అన్నారు. చంద్రబాబునాయుడు రాజకీయాల్లోకి రాక ముందే, తెలుగుదేశం పార్టీ పుట్టకముందే, వైఎస్ఆర్‌సీపీ పార్టీ పుట్టకముందే, గన్ పుట్టకముందే కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జీవోఎంఎస్ 1793 ద్వారా కాంగ్రెస్ పార్టీ బీసీలకు విద్య, ఉద్యోగాలలో 25శాతం రిజర్వేషన్లు కల్పించిందని, తద్వారా లక్షలాదిమంది బీసీలు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు పొందారన్నారు.విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే స్థానిక ప్రభుత్వాల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. తద్వారా లక్షలాది మంది బీసీలు, మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు, జడ్పీ ఛైర్మన్లు, మండల పరిషత్ అధ్యక్షులు, సర్పంచులుగా ఎన్నికయ్యారని తెలిపారు.

## జిల్లాస్థాయికి ఎంపిక

**వేంపల్లె, అక్టోబరు 28, ప్రభాతవార్త :**



పులివెందులలోని సత్రం స్కూల్‌లో జోనల్ లెవెల్‌లో శుక్రవారం జరిగిన అండర్-17 త్రో బాల్ బాలికల విభాగంలో ఇందు, లక్ష్మీరూప్సీలు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు స్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. తమ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక కావడంతో స్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి విద్యార్థులను, పీఈటీలను అభినందించారు.

## శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో రాహుకాల పూజలు

**రాయచోటి టౌన్.అక్టోబర్ 28 ప్రభాతవార్త**



రాయచోటి పట్టణంలో వెలసిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా రాహుకాల పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి ఛైర్మన్ పోలంరెడ్డి విజయ, ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వి.రమణారెడ్డి ల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కృష్ణయ్య, స్వాముల వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీ భద్రకాళీ అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరిచి రాహుకాల పూజలు నిర్వహించారు. అనంతరం రాయచోటి పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు, కన్నడ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి భక్తి శ్రద్దలతో రాహుకాల పూజలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాహుకాల పూజలు విశిష్టత గురించి భక్తులకు తెలియజేసి తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

## ఆంజనేయులు రెడ్డిని పరామర్శించిన రాంప్రసాద్‌రెడ్డి

**రాయచోటి.అక్టోబర్ 28 ప్రభాతవార్త**



రాయచోటి పట్టణంలోని సూపర్ స్పెషాలిటి హాస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆంజనేయులు రెడ్డిని శుక్రవారం రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువనాయకుడు మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. చిన్నమండెం మండలం బోనమలకు చెందిన ఆంజనేయులు రెడ్డి అనారోగ్యంతో హాస్పిటల్ ఉన్న ఆయన దగ్గరకు వెళ్లి ఆరోగ్య విషయం చర్చించి అనంతరం హాస్పిటల్ డాక్టర్ లక్ష్మీప్రసాద్‌తో ఆంజనేయులు రెడ్డి ఆరోగ్య విషయం చిర్చంచి మెరుగయిన వైద్యం అందించాలని ఆయన కోరారు. ఈయన వెంట తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంట నమోదు పరిశీలన

**దువ్వూరు, అక్టోబరు 28, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని మాచనపల్లె రెవెన్యూ గ్రామ పొలంలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గతంలో పంట నమోదు చేసిన రైతుల జాబితాను తీసుకొని వారి పొలాల వద్దకు వెళ్లి ఆయా సర్వే నెంబర్ల వారీగా నమోదు చేసిన పంట సాగు చేశారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా మండల స్థాయి అధికారులకు క్షేత్రస్థాయి పంట నమోదు సక్రమంగా జరిగిందా లేదా అని అధికారులను నియమించారా లేదా వారికి కొన్ని సర్వే నెంబర్లు ఇచ్చి సక్రమంగా పరిశీలించి నివేదికలు నిర్వహించేలా తనిఖీ చేపట్టామన్నారు. అందులో భాగంగా మాచనపల్లెలో 5 మంది పత్తి వేసినట్లు సాగు చేయడంతో వాటిని జాబితా నుంచి తొలగించామన్నారు. ఆయన వెంట వ్యవసాయ సహాయాధికారి యువతేజ తదితరులు పాల్గొన్నారు

## రైతుల సమస్యలు తీర్చేందుకు కృషి చేయాలి

**– జడ్పీ ఛైర్మెన్ ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి**

**వీరబల్లి, అక్టోబర్ 28ప్రభాతవార్త:**



ప్రతి అధికారి ప్రజల, రైతుల సమస్యలు తీర్చుటకు కృషి చేయాలని జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వీరబల్లి మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రజల, రైతుల సమస్యలు తీర్చుటకు కృషి చేస్తూ వారికి అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి రైతు సాగు చేసిన పంటను ఇక్రాఫ్ బుకింగ్ చేయాలన్నారు. వారి కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వారికి అందేటట్లు చూడాలన్నారు.వ్యవసాయ అధికారులును సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమం ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

**అధికారులను నిలదీసిన సర్పంచ్‌లు :**

తమకు వచ్చిన నిధులును తిరిగి ప్రభుత్వ అధికారులు కరెంట్ బిల్లులని, దానికి దీనికని పారిశుద్ధ్యం సిబ్బందికి జీతాలు ఇవ్వాలంటూ తిరిగి లాగేసుకోవడం మంచిదికాదని, మేము కట్టమని అధికారులపై సర్పంచ్‌లు ఒకటై తిరగబడ్డారు. మేము అభివృద్ధి పనులు చేయాలి, ప్రజలుకు మేము ఏమి సమాధానం చెప్పాలని అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, ఎంపిటిసిలు, ఎంపిడివో మధుసూదన్ రెడ్డి, తహశీల్దార్ తులశమ్మ, జడ్పీటిసి శివరాం తదితరులు పాల్గొన్నారు.

## తెల్లపాడు ఎస్సీ కాలనీలో వీధిలైట్లు వెలిగేదెప్పుడు?

**పోరుమామిళ్ళ రూరల్, అక్టోబర్ 28ప్రభాతవార్త:**

కలసపాడు మండలం కేంద్రానికి కూతవేటు దూరంలో ఉండే తెల్లపాడు గ్రామ పంచాయతీలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలలో వీధి లైట్లు వెలగకపోవటంతో ప్రజలు అవస్తలు చెప్పలేనివని, ఎన్ని దఫాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని ఎస్సీ, ఎస్టీ కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలను విచారించగా రాత్రి వేళల్లో వృద్ధులు, చిన్న పిల్లలు, ప్రజలు, పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మా పంచాయతీలోని వీధి లైట్లను సరిచేసి, మరమ్మతులు చేపట్టి రాత్రుల్లో వీధి దీపాలు వెలిగించాలని, ఊరి చుట్టూ కంపచెట్లు, తెలుగుంగ కాలువ నీరు పారుతుండడంతో గ్రామంలోనికి విషపురుగులు వస్తున్నాయన్నారు. విషపురుగులు, జంతువుల భారీ నుండి ప్రమాదాలు జరగకముందే కాపాడాలని అధికారులను ప్రజలు కోరుకుంటున్నారు.

## క్రీడా పోటీలు ప్రారంభం

**రాయచోటి టౌన్.అక్టోబర్ 28 ప్రభాతవార్త**



రాయచోట పట్టణంలోని స్థానిక నేతాజి సర్కిల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా పోటీలు శుక్రవారం అట్టహసంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా పోటీలకు తాలూకాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలను ప్రారంభిస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఈ క్రీడాపోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు చక్కటి అవకాశమని అలాగే క్రీడలలో గెలుపోటములు సర్వసాధారణమని, ఓటమే భవిష్యత్తులో సాధించబోయే గెలుపునకు తొలిసోపానంగా భావించి తమ క్రీడా నైపుణ్యాలను పెంచుకోవాలని క్రీడాకారులకు సూచించరు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివరామిరెడ్డి, ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాబీర్ మరియు వ్యాయామ ఉపాధ్యాయులు రెడ్డెయ్య, జగదీష్, లలిత, శ్రీరాములు, రామచంద్ర, వెంకటేశ్వర్లు, సులోచన, లక్ష్మీనారాయణ మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్ద పెను ప్రమాదాన్ని తప్పించిన స్పెషల్ పార్టీ పోలీసులు

**-అభినందించిన ప్రజలు**

**రాయచోటి.అక్టోబర్ 28 ప్రభాతవార్త**



పెద్ద పెను ప్రమాదం తప్పించి ప్రజల మన్ననలు పొందారు స్పెషల్ పార్టీ పోలీస్‌లు, వివరాలలోకి వెళితే రాజంపేట- రాయచోటికి వెళ్లే మార్గంలోని గొల్లపల్లె సమీపంలో నడిరోడ్డు పై 30 మీటర్ల దూరంలో పెద్ద శబ్దం వచ్చి 33 కెవి విద్యుత్ లైన్ తెగి రోడ్డు మీద పడింది. అదే సమయంలో అన్నమయ్య జిల్లా స్పెషల్ పార్టీ పోలీస్‌లు ఆర్ఎస్ఐ ఎస్.జాఫర్ వారి బృందంతో వెళుతున్నారు. ఆ శబ్దాన్ని గమనించిన వారు వాహనాన్ని ఆపివేసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ సమయంలో తెగిపడ్డ విద్యుత్ లైన్ కరెంట్ సరఫరాతో ఉంది. అప్రమత్తమయిన పోలీస్‌లు రోడ్డుకు ఇరువైపులా ఉండి వాహనాలు ఆపివేసి ఆ దారిలో వస్తున్న ప్రజలందరికి విషయం తెలియజేశారు. లైన్‌మెన్ వచ్చి రిపేర్ చేసేంత వరకు పోలీస్‌లు అక్కడే ఉన్నారు. వైర్ తెగిబడ్డ సమయంలో ఆర్టీసి బస్సు 40 మంది ప్రయాణికులతో వచ్చింది. బస్సును ముందుకు వెళ్లకుండా ఆపారు. ప్రయాణికులు పోలీస్‌లను పలువురు అభినందించారు.

## శాస్త్రీయ ఆలోచనలకు చెకుముఖి సైన్స్ సంబరాలు

**సంబేపల్లె.అక్టోబర్ 28 ప్రభాతవార్త**



విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించడానికి చెకుముకి సైన్స్ సంబరాలు తోడ్పడుతాయిన ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా విద్యార్థులతో నిర్వహించే ప్రశ్నా పత్రాలను పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులుతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని కలిగించడానికి సృజనాత్మక ఆలోచనలు పెంపొందించడానికి జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి ప్రశంశనీయమన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల అద్యక్షుడు శంకరయ్య,ఉపాధ్యాయిని ఉమాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిక్ బాక్సింగ్ విద్యార్థికి అభినందనలు

**రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 28 ప్రభాతవార్త**



రైల్వేకోడూరు మండలంలోని డాల్ఫిన్‌డేల్ పాఠశాలలో చదువుకొంటున్న ఫిక్‌బాక్సింగ్‌లో మాస్టర్ మౌలా ఆధ్వర్యంలో డాల్ఫిన్‌డేల్ విద్యార్థులకు గోల్డ్‌మెడల్ ఏలూరు నందు పొందిన విషయం విధితమే. ఈనేపథ్యంలో అక్కడ విజయం సాధించిన గోల్డ్ మెడల్ విద్యార్థులను డాల్ఫిన్‌డేల్ స్కూల్ కరస్పాండెంట్ పంజం సుకుమార్‌రెడ్డి, ప్రదానోపాధ్యాయులు బాలకుమార్‌లు ఘనంగా అభినందించారు.పాఠశాల కరస్పాండెంట్ పంజం సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కఠినమైన పరీక్షలతోను, క్రీడల్లోను తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభను కనబరుస్తున్నారని, వారిని మనస్ఫూర్తిగా అభినందనలతో ముంచెత్తుతున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, తల్లిదండ్రులు గోల్డ్‌మెడల్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## శిల్పారామం నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి

**–కలెక్టర్ గిరీష పిఎస్**

**రాయచోటి.అక్టోబర్ 28 ప్రభాతవార్త**



అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి ప్రజలతో పాటు జిల్లా పౌరుల ఆహ్లాదం కోసం పర్యాటక శాఖ ఆద్వర్యంలో రాయచోటిలో శిల్పారామం నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని జిల్లా కలెక్టర్ గిరీషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు జిల్లాకు అందాయన్నారు. అన్నమయ్య జిల్లా రామాపురం మండలం బండపల్లె గ్రామంలో 11.62 ఎకరాల ప్రభుత్వ భూమిలో శిల్పారామం ఏర్పాటుకు గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. శిల్పారామం ఏర్పాటుతో ప్రత్యక్షంగా 100 మందికి పరోక్షంగా మరో 200 మందికి ఉపాధి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. నగరాలకు మాత్రమే పరిమితమయిన శిల్పారామం ఇప్పుడు మన రాయచోటి పట్టణంలో ఏర్పాటు కాబోతోంది. ఇందులో హస్తకళాకారుల కోసం సంవత్సరం పొడవునా వారి ఉత్పత్తుల ప్రదర్శన అమ్మకం కోసం స్టాల్స్ నిర్మించి ఉచితంగా కేటాయించి వారికి జీవనోపాదం కల్పించడం, శాస్త్రీయ మరియు జానపద కళాకారుల ప్రదర్శనకు అవకాశాలు కల్పించడంతో పాటు కళారూపాలు పరీక్షించడం మరియు ప్రజలకు ఆహ్లాదకర పచ్చని వాతావరణంలో ఉద్యాన వనం ఏర్పాటు చేసి కుటుంబ సమేతంగా వచ్చి సేదతీరేలా ఏర్పాటు చేస్తూనే పిల్లల ఆట విడుపు కోసం కూడా ఆట వస్తువులు కూడా ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. శిల్పారామం నిర్మాణ ప్రక్రియను వీలయినంత త్వరగా పూర్తి చేస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

**–జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు**

**రాయచోటి.అక్టోబర్ 28 ప్రభాతవార్త**



రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్ని దానాలలో రక్త దానం ప్రధానమయినదని అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. పోలీస్‌ల అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు రక్తదాన శిభిరాన్ని ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రారంభించారు. శాంతి భద్రతల రక్షణలో ప్రాణాలను అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మన భాద్యత, సమాజం కోసం వారు వారి కుటుంబాల త్యాగాలు ఎన్నటికి మర్చిపోలేనివని ఆయన అన్నారు. శ్రీదీప వాలంటరీ బ్లడ్ సెంటర్ సంస్థ ఆద్వర్యంలో రక్తదాన శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రజల రక్షణ కోసం అహర్నిషలు నిరంతరం నిస్వార్ధంగా విధులు నిర్వహిస్తూ పోలీస్ అధికారు లు సిబ్బంది త్యాగగుణం దృఢ సంకల్పంతో రక్త దానం చేయడం అభినందనీయ మన్నారు. ముందుకు వచ్చి రక్త దానం చేసిన పోలీస్‌లను ఆయన అభినందిం చారు. రక్తదాన విశయంలో ఎలాంటి అపోహలు వద్దని ప్రతి ఒక్కరు రక్తదానం చేయడం వలన ఇతరులకు ప్రాణదాతలు అవుతారని చెప్పారు. మనమిచ్చే రక్తం ఆపదలో ఉన్నవారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆపద సమ యాలలో రక్తం దొరకక చాలా మంది మరణిస్తున్నారని అటువంటి వారికి మనమి చ్చే రక్తం మరో జన్మ ఇచ్చినట్లే. మానవ సేవే మాధవ సేవ అని ఎస్పీ అన్నారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమర వీరులను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 నుంచి 31 వరకు అమరవీరుల సంస్కరణ దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, ఏరియా హాస్పిటల్ సూపరిడెంట్ చంద్రశేఖర్, సీనియర్ డాక్టర్ మహేశ్వర్‌రాజు,దీపాబ్లడ్ బ్యాంక్ సభ్యులు, పోలీస్ అధికారులు, పోలీస్‌లు పాల్గొన్నారు.

## క్రీడలలో పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలి

**– డా॥ రామలక్ష్మిరెడ్డి**

**బద్వేలు అర్బన్, అక్టోబరు 28 ప్రభాతవార్త :**



బద్వేలు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు జిల్లా విద్యా శాఖ అధికారి,జిల్లా స్కూల్ గేమ్స్ శాఖ ఉత్తర్వుల మేరకు శుక్రవారం బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు, గోపవరం, బద్వేలు, బి.కోడూరు, పోరుమామిళ్ళ, కలసపాడు, కాశినాయన మండలాల నుండి ఎంపికైన క్రీడాకారులకు స్థానిక బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాల మైదానం నందు జిల్లా స్థాయి పోటీలకు జట్ల ఎంపికలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, త్రో బాల్, కోకో, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, బ్యాట్మింటన్, యోగ, అథ్లెటిక్స్ 14 సంవత్సరాల బాల బాలికలు మరియు 17 సంవత్సరాల లోపు బాల, బాలికల ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలలో దాదాపుగా 800 మంది క్రీడాకారులు పాల్గొని క్రీడా ప్రతిభ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరు 7వ తారీఖు నుండి జరిగే జిల్లా ఎంపికలలో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బా రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా॥ వెంకటసుబ్బారెడ్డి మరియు నిర్వహణ బాధ్యులు మహబూబ్ బాష, రమేష్ యాదవ్, బాలయ్య, నరసరాజు, సుబ్బారావు, ప్రభాకర్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు తెలియజేశారు.

## వీరభద్రస్వామి దేవాలయంలో వైభవంగా గౌరమ్మకు విశేష పూజలు

**బద్వేలు అర్బన్, అక్టోబరు 28 ప్రభాతవార్త :**



పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో కార్తీక మాసం పురస్కరించుకొని శుక్రవారం గౌరమ్మకు వివిధ రకాల విశేష పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు దేవాలయం ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లక్ష్మిదేవి, స్పీకర్ దేవతి లలిత, సెక్రటరి తిరువీధి స్వప్న, ట్రెజరర్ ప్రొద్దుటూరు రాజేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ ఇమ్మడిశెట్టి నాగమణితో పాటు పలువురు తెలియజేశారు. అనంతరం వీరభద్ర స్వామి దేవస్థానం ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లక్ష్మిదేవి, స్పీకర్ దేవతి లలితాతో పాటు పలువురు మాట్లాడుతూ కార్తీక మాసం చాలా పవిత్రమైన మాసం అని, ఈ మాసంలో గౌరమ్మకు విశేష పూజలు నిర్వహించడం వలన అనేక శుభ ఫలితాలు కలుగుతాయన్నారు. శుక్రవారం పలువురు ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో గౌరమ్మకు వివిధ రకాల ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని వారు తెలియజేశారు. మూడు రోజుల పాటు గౌరమ్మకు వివిధ రకాల విశేష పూజలు నిర్వహించి, అనంతరం చివరి రోజు నిమజ్జన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీరభద్రస్వామి దేవస్థానం మహిళా మండలి సభ్యులు పత్తి పుష్పలత, గొంట్లా కుమారి, బచ్చు నాగలక్ష్మి, నిచ్చెనమెట్ల రాధ, భారతి, సూరే రేష్మ, చిన్ని లక్ష్మీదేవి, ఓలేటి సుజాత, నేతి లక్ష్మిదేవి, నేతి కుమారి, మేడా లక్ష్మి, జూటూరు పద్మ, గుడుగుంట్ల ప్రభావతి, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

## క్రీడలతో అంతర్జాతీయ ఖ్యాతి : సిఐ విశ్వనాథ్‌రెడ్డి

**రైల్వేకోడూరు, అక్టోబరు 28 ప్రభాతవార్త**



క్రీడాకారులు వారు చూపించే క్రీడల పట్ల అంతర్జాతీయ ఖ్యాతిని పొందవచ్చునని రైల్వేకోడూరు సిఐ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. గత 2 రోజులుగా జరుగుతున్న రైల్వేకోడూరు నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ఇందులో అథ్లెటిక్, యోగా, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ తదితర క్రీడలకు సంబంధించిన కళాకారులు, వారి ప్రతిభను బట్టి ఎంపిక చేసి జిల్లాస్థాయికి పంపనున్నట్లు నియోజకవర్గ కోఆర్డినేటర్ తిప్పన భాస్కర్ తెలిపారు. మొదటగా కె.బుడుగుంట పల్లె పంచాయతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభించామని దాదాపు వందలాది మంది విద్యార్థులు ఈ క్రీడల్లో విశేష ప్రతిభను కనబరచారన్నారు.కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు శివశంకర్‌రాజు, చిట్వేలి ఫిజికల్ డైరెక్టర్ దేవిడ్, చంద్రకుమార్, ప్రసాద్, శ్రీనివాసమూర్తితో పాటు శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఐటీలో బేసిక్ మ్యాట్‌ల్యాబ్ మీద వర్క్‌షాప్

**ప్రొద్దుటూరు క్రైం, అక్టోబరు 28, ప్రభాతవార్త:**



సాయిరాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం బీటెక్ ఈఈఈ, 3, 4వ సంవత్సరం విద్యార్థులకు ఉన్నత విద్యను ఎన్ఐటీ-కురుక్షేత్ర నందు విద్యను అభ్యసించి ప్రస్తుతం సిమెన్స్ కంపెనీ, బెంగళూరు నందు సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరు ఎం.బాలకృష్ణంరాజుతో బేసిక్ మ్యాట్ ల్యాబ్ ప్రోగ్రాం మీద వర్క్‌షాప్ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. వర్క్‌షాప్‌లో భాగంగా మ్యాట్ లాబ్ ప్రోగ్రాం మీద విద్యార్థి విద్యార్థినులకు శిక్షణ ఇస్తూ, మ్యాట్ ల్యాబ్ కోడింగ్ మీద పట్టు సాధించి ప్రాజెక్టులను చేసుకోగలుగుతారని బాలకృష్ణంరాజు వివరించారు. ఈఈఈ హెచ్‌వోడీ కం వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మ్యాట్ ల్యాబ్ మీద పూర్తి అవగాహనతో విజ్ఞానాన్ని సంపాదించి దాని ద్వారా ఉన్నత స్థాయి విద్యకు, రీసెర్చ్‌కు, సాఫ్ట్‌వేర్ జాబ్స్ కొరకు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈఈ విభాగానికి చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఇన్‌కంట్యాక్స్ చెల్లింపులు ప్రతి ఒక్కరి బాధ్యత

**ఇన్‌కంట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేష్ సామ్రాట్**

**కడప, అక్టోబర్ 28 ప్రభాతవార్త :**



ఇన్‌కంట్యాక్స్ చెల్లింపులు ప్రతి ఒక్కరి బాధ్యతగా ఉండాలని ఇన్‌కంట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేష్ సామ్రాట్ అన్నారు. శుక్రవారం హెూటల్ మానస ఇన్‌లో జిల్లాలోని వ్యాపార వర్గాల అసోసియేషన్స్‌తో పాటు ఇన్‌కంట్యాక్స్ ఆడిటర్స్, చార్టెడ్ అకౌంటెంట్స్‌కు ఇన్‌కంట్యాక్స్ చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. వ్యాపారులతో పాటు ఇతర వర్గాలకు ఇన్కమ్ టాక్స్ చట్టంపై అవగాహన కల్పించాలని ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. డిజిటల్ చెల్లింపుల నేపథ్యంలో వ్యాపారులు చేస్తున్న వ్యాపారాలకు సంబంధించి బ్యాంకు లావాదేవీలు తమ దృష్టికి వస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం ట్యాక్స్ చెల్లిస్తున్న వారితోపాటు టాక్స్ పరిధిలో లేని వారు కూడా టాక్స్ చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్ అండ్ కన్సల్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పఠాన్ షరీఫ్ ఖాన్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో వ్యాపారులలో పోటీ తత్వం వల్ల సరైన లాభాలు రావడంలేదని పేర్కొన్నారు. చిన్న చిన్న పొరపాట్లకు పెద్ద మొత్తంలో అపరాధ రుసుములు చెల్లించాలని సరికాదన్నారు. ఫైలింగ్ విషయములో ఆడిటర్స్ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపించాలని విజ్ఞప్తి చేశారు. ది కడప జ్యూవెలర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ చిన్న చిన్న వ్యాపారులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రైవేటు వ్యక్తుల నుంచి తెచ్చుకున్న డబ్బులకు వడ్డీ ఎక్కువ అవుతుందని తెలిపారు. బ్యాంకులు రుణాలు మంజూరు చేసేలా చూడాలని కోరారు. వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రామమూర్తి, కార్యదర్శి హరి కిషోర్ రెడ్డి, చార్టెడ్ అకౌంటెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్ రావు, ప్రొద్దుటూరు టాక్సీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన్ గుప్తా, కడప అధ్యక్షులు జీవీ శివరావు, ఇన్కమ్ టాక్స్ నెల్లూరు డిప్యూటీ కమిషనర్ భరద్వాజ, ఆఫీసర్స్ సత్యనారాయణ, పి.వి. రమణ, సిబ్బంది వ్యాపారులు ఆడిటర్లు పాల్గొన్నారు.

## విద్యా పరిశోధనకు జర్మని యూనివర్శిటీతో అన్నమాచార్య కళాశాల ఒప్పందం

**రాజంపేట అర్బన్, అక్టోబరు 28 ప్రభాతవార్త**



సాంకేతిక విద్యా రంగంలో పరస్పర అవగాహన ద్వారా విద్యా పరిశోధన సహకారం కోసం ఐదేళ్ల ఐదేళ్ల పాటు ఒప్పందాన్ని జర్మనీ దేశానికి చెందిన ఆచెన్ యూనివర్శిటీతో బోయనపల్లెలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకొంది. ఎంఒయు ఇంజనీరింగ్ విద్యార్థులకు వరం కానుందని అన్నమాచార్య విద్యా సంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి పేర్కొన్నారు. విద్య, పరిశోధన సహకారంపై ఆచెన్ యూనివర్శిటి తరపున డాక్టర్ హెల్మట్ ఎపిఎస్‌సిహెచ్‌ఇ ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకొన్నారు. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, రెండు సంస్థల మధ్య మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో నైపుణ్యాభివృద్ధి పెంచుకోవడం, ఆధునిక సాంకేతికతను పెంపొందించడం, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విద్యార్థులకు ప్రోగ్రామ్‌లు అందించడం ద్వారా అద్భుత ఫలితాలు సాధించడమే తమ లక్ష్యమన్నారు. 2 యూనివర్శిటీల మధ్య సామాజిక, సాంకేతిక వాతావరణాలు, భిన్నాభిప్రాయాలు, వినూత్న ఆలోచనలు, విద్య అభ్యాసానికి ఎంతో దోహద పడుతుందని వారు ఆకాంక్షించారు. ఆచెన్ యూనివర్శిటి ప్రపంచంలోనే 36వ ర్యాంకులో ఉందని, ఈ యూనివర్శిటీతో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా మారడంతో పాటు ఉన్నత స్థాయి ప్రమాణాలను అందుకొనేందుకు ఉపయోగపడుతుందని ఎఐటిఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి ఆకాంక్షించారు.

## కనక దుర్గమ్మ అమ్మవారికి విశేష పూజలు

**బద్వేలు అర్బన్, అక్టోబరు 28 ప్రభాతవార్త :**



కార్తీక మాసం పురస్కరించుకొని మొదటి శుక్రవారం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వెలసి వున్న శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యులు పబ్బతి చంద్రశేఖర్, వడ్లపూటి నాగభూషణం, దరిసి సుబ్బరాజుతో పాటు పలువురు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ పూజారి ప్రదీప్ కుమార్ శర్మ మంత్రోచ్చరణల మధ్య కనక దుర్గమ్మ అమ్మవారికి వివిధ రకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు మహిళలు అమ్మవారికి కాయా కర్పూరం సమర్పించుకొని తమ భక్తిని చాటుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రత్యేక తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**మానవత్వం చాటిన ట్రాఫిక్ పోలీసులు**

**బద్వేలు అర్బన్, అక్టోబరు 28 ప్రభాతవార్త :**



బద్వేలు పట్టణంలో శుక్రవారం సాయంత్రం సిద్దవటం రోడ్ ఆర్టీసి బస్టాండ్ నుండి నాలుగు రోడ్ల కూడలి వైపు వెళుతున్న కారు, ద్విచక్ర వాహనం రోడ్డు ప్రమాదానికి గురై వ్యక్తికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. నాలుగు రోడ్ల కూడలిలో సిగ్నల్స్ వద్ద ఆగి ఉన్న కారు డోరు తెరవడంతో వెనుక వైపున వస్తున్న ద్విచక్ర వాహనం కారు డోరు తగిలి ద్విచక్ర వాహనంలోని వ్యక్తి అక్కడికక్కడే కిందపడి అట్లూరు మండలం వేములూరుకు చెందిన తుమ్మలూరు అశోక్ కుమార్ అనే వ్యక్తి కాలుకు తీవ్రగాయాలు కావడంతో సంఘటనా స్థలంలో రక్త గాయాలయ్యాయి. వెంటనే ట్రాఫిక్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ శేఖర్, హోంగార్డు గుర్రయ్య, ప్రకాష్ తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఆటోలో ఆసుపత్రికి తీసుకువెళ్ళారు.